జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 9 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 9



## భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 8,(ప్రజాజ్యోతి )** జూలూరుపాడు మండలం నల్లబండ బోరు గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీ-సర్వే పురోగతి, ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలు, గ్రామ సరిహద్దుల తదితర అంశాలను సర్వే, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు.నల్లబండ బోరు గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 1,426 ఎకరాల భూమి ఉండగా, సుమారు 12.50 కిలోమీటర్ల మేర భూ రీ-సర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూ రీ-సర్వేను పకడ్బందీగా

మిగతా 2 లో...




## కార్పోరేషన్ లో.. 'టౌన్ ప్లానింగ్' విఫలం!

9 లో..

- అడ్డగోలు నిర్మాణాలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు..
- ఎంజీ రోడ్డుపై పార్కింగ్ కష్టాలు.. ఫుట్‌పాత్‌లు మొత్తం ఆక్రమణలలే..
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోని టౌన్ ప్లానింగ్..
- ఫిర్యాదులు చేసినా స్పందన లేదంటున్న బాధితులు..
- అధికారుల తీరుపై ఆరోపణలు.. డబ్బులు చేతులు మారుతున్నాయన్న ప్రచారం..?
- రెండు నెలల తర్వాత కదిలిన యంత్రాంగం.. హెచ్చరికలతోనే సరిపెడతారా?

కొత్తగూడెం పట్టణం అభివృద్ధి వైపు వేగంగా పరుగులు తీస్తోందన్న ప్రచారానికి, క్షేత్రస్థాయి వాస్తవాలకు నడుమ ఆకాశమంత వ్యత్యాసం కనిపిస్తోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌గా అవతరించినప్పటికీ, యంత్రాంగం వైఫల్యం వల్ల అడ్డగోలు నిర్మాణాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ అభివృద్ధిని నిబంధనల ప్రకారం నడిపించాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్ ప్లానింగ్) కంటిముందే ఉల్లంఘనలు జరుగుతున్నా టీపీఓ పర్యవేక్షణ కొరవడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల మౌనం వెనుక భారీ కుంభకోణం ఉందన్న ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి



## 'సర్' ప్రక్రియపై సమరభేరి...

- ఓటు హక్కు పరిరక్షణకు ఇండియా కూటమి పిలుపు
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలని కొత్తగూడెంలో భారీ ర్యాలీ
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా నేతృత్వంలో పాదయాత్ర

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి :** ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసే పాలకుల అణచివేత చర్యలను ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక ఓటు హక్కును కాలరాసే విధంగా సాగుతున్న 'సర్' ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'సర్' ప్రక్రియకు నిరసనగా సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, న్యూ డెమోక్రసీ, మాస్ లైన్, జనసమితి (ఇండియా కూటమి) పార్టీల

మిగతా 2 లో...

## పేలుడు పదార్థాల నిర్వీర్యంలో ప్రమాదం

- నలుగురు సీఆర్పీఎఫ్ జవాన్లకు గాయాలు



**చర్ల, అక్టోబర్ 08:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎలార్మడగు క్యాంపు సమీపంలో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే కొంటా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఉన్నత వైద్య కేంద్రానికి తరలించారు.అక్టోబర్ 8న 50వ బెటాలియన్ సీఆర్పీఎఫ్‌కు చెందిన అమ్యునిషన్ టెక్నీషియన్ టీమ్ (ఏటీటీ) జగదల్‌పూర్ నుంచి ఎలార్మడగు క్యాంపునకు చేరుకుంది. కొంటా రేంజ్ పరిధిలోని పిడ్మెల్, దబ్బకొంట, కోలైగూడ, ఎలార్మడగు తదితర క్యాంపులను తనిఖీ చేసి, అక్కడ నిల్వ ఉన్న పనికిరాని, మిగిలిపోయిన పేలుడు పదార్థాలను భద్రతా ప్రమాణాల ప్రకారం ధ్వంసం చేసేందుకు ఈ బృందం వెళ్లింది.ఎలార్మడగు క్యాంపునకు సుమారు 200 మీటర్ల దూరంలోని బోద్రజ్‌పదర్ నాలా సమీపంలో పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే ప్రక్రియ కొనసాగుతుండగా, ప్రమాదవశాత్తు పేలుడు

మిగతా 2 లో...

## అన్నపురెడ్డిపల్లి రహదారికి ఏమైంది..
## ప్రాణాలు పోయేదాకా పట్టించుకోరా?

- భారత్ పెట్రోలియం బంకు వద్ద గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి
- వర్షం పడితే కుంటలను తలపిస్తున్న గుంతలు.. వాహనదారులకు తప్పని తిప్పలు



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 8, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల అన్నపురెడ్డిపల్లి గ్రామం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైపు వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. భారత్ పెట్రోలియం బంకు సమీపంలో రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తుండటంతో వాటి లోతు తెలియక

మిగతా 2 లో...

## భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించి, భూముల వివరాలు కచ్చితంగా నమోదు చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన సాంకేతిక పద్ధతులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. భూ సరిహద్దుల విషయంలో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం భూములకు సంబంధించిన రికార్డులు మరింత స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం గ్రామంలోని రైతులతో కలెక్టర్ మాట్లాడి భూ రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, వారి భూముల వివరాలు, సాగు చేస్తున్న పంటలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భూక్యా పంతులు తనకు రెండు ఎకరాల భూమి ఉందని, అందులో ఒక ఎకరంలో పత్తి, మరో ఎకరంలో మిర్చి సాగు చేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు.తన కుమారులు తనను పట్టించుకోవడం లేదని, వృద్ధాప్య పింఛన్ కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు రైతు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు వెంటనే దరఖాస్తును పరిశీలించి, అర్హత మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జూలూరుపాడు తహసీల్దార్ శ్రీనివాస్, సర్వేయర్, సర్పంచ్ జి. సింధు, రైతులు, సర్వే సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేలుడు పదార్థాల నిర్వీర్యంలో ప్రమాదం



(మొదటి పేజీ తరువాయి...)

సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఏటీటీ బృందానికి చెందిన ఏఎస్ఐ ఎం.కె. తివారీ, 50వ బెటాలియన్ సీఆర్పీఎఫ్‌కు చెందిన ఏఎస్ఐ అనీష్ ఖాన్ తీవ్రంగా గాయపడ్డారు. ఏటీటీ బృందానికి చెందిన ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ మిశ్రా, 50వ బెటాలియన్ సీఆర్పీఎఫ్‌కు చెందిన పి.ఆర్. కుల్దీప్ రాజ్ స్వల్పంగా గాయపడ్డారు.ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన నలుగురికి కొంటా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం వారు అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిస్థితులపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## అన్నపురెడ్డిపల్లి రహదారికి ఏమైంది.. ప్రాణాలు పోయేదాకా పట్టించుకోరా?



(మొదటి పేజీ తరువాయి...)

వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే ఇబ్బందికరంగా మారింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు గుంతల కారణంగా కిందపడిపోయి గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నిస్తున్నారు. ఆర్అండ్‌బీ శాఖతో పాటు సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చి వాహనదారులకు సురక్షిత రాకపోకలు కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# 'సర్' ప్రక్రియపై సమరభేరి...

(మొదటి పేజీ తరువాయి...)

సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుంచి భారీ 'ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర' నిర్వహించారు. రైల్వే స్టేషన్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీ అనంతరం జరిగిన బహిరంగ సభలో పలువురు నాయకులు పాల్గొని ప్రసంగించారు.




**ఈసీ జ్ఞానేష్ కుమార్‌ను భర్తరఫ్ చేయాలి: సాబీర్ పాషా**

బహిరంగ సభలో ముఖ్య వక్తగా ప్రసంగించిన సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ.. 'సర్' ప్రక్రియ వెనుక దాగివున్న కుట్రలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం సుప్రీం కోర్టు పరిధిలో ఉండగానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం గర్హనీయమన్నారు. శ్రమజీవుల, పీడిత ప్రజల కనీస రాజకీయ హక్కు అయిన ఓటును కొల్లగొట్టే కుట్రలు సాగుతున్నాయని మండిపడ్డారు. పాలకవర్గాల అడుగులకు మడుగులొత్తుతూ పనిచేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడమే ప్రజాస్వామ్యానికి రక్షణ అని అన్నారు. ఇప్పటివరకు అక్రమంగా తొలగించిన అర్హుల ఓట్లను వెంటనే పునరుద్ధరించకపోతే రాజీలేని ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు.

**అధికార పార్టీకి తొత్తుగా ఎన్నికల కమిషన్: దేవి లక్ష్మి ప్రసన్న**

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవి లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ.. చట్టబద్ధమైన నిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా చేపట్టిన 'సర్' ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తూ ప్రజల హక్కులను హరిస్తున్నారని, ఆయనను వెంటనే విధుల్లోంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

**నిష్పాక్షికత కోల్పోయిన ఈసీ: మచ్చ వెంకటేశ్వర్లు**

సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ తన నిష్పాక్షికతను కోల్పోయి ఏకపక్షంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. అక్రమంగా అర్హుల ఓట్లను జాబితాల నుండి తొలగించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు.

**ఓట్ల గల్లంతు ముమ్మాటికీ ప్రజాద్రోహమే: కూటమి నాయకులు**

మేయర్ మూడ్ గణేష్, కూటమి నాయకులు కెచ్చల రంగారెడ్డి, గౌని నాగేశ్వర్ రావు, కవిత, దేవదానం మాట్లాడుతూ.. సాంకేతికత పేరిట సామాన్య పౌరుల ఓట్లను గల్లంతు చేయడం ముమ్మాటికీ ప్రజాద్రోహమేనని ధ్వజమెత్తారు. దేశంలో ఎన్నికల నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరగాల్సిన చోట ఇలాంటి అనుమానాస్పద సర్వేలను తెరపైకి తేవడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు కేసులను లెక్కచేయకుండా ముందుకెళ్లడం పాలకుల అహంకారానికి నిదర్శనమని, తక్షణమే ఈసీపై సమగ్ర న్యాయ విచారణ జరిపించి, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఏజే రమేష్, సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వరరావు, జి వీరాస్వామి, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్ కే ఫహీమ్, ఎమ్మెల్ పార్టీల జిల్లా నాయకులు ముద్దా బిక్షం, తుపాకుల నాగేశ్వరరావు, ఆయా పార్టీల కీలక నాయకులు అన్నవరపు సత్యనారాయణ, బ్రహ్మ చర్య, భూక్యా రమేష్, కొత్వాల శ్రీను, సిరిపురపు లలిత, మండే హన్మంతరావు, ఆళ్ల మురళి, ఉమర్, సీతారామయ్య, సారంగపాణి, జాటోత్ కృష్ణ, గోపాలరావు, అమర్లపూడి రాము మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- గోడౌన్ను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేడు, అక్టోబర్ 8, (ప్రజాజ్యోతి)** కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గోడౌన్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత కీలకమైన అంశమని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీ






ప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థ, విద్యుత్ బ్యాకప్, భద్రతా పర్యవేక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని సూచించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని వ్యక్తులను గోడౌన్‌లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్వీఎన్‌లో ఘనంగా ఫౌండర్స్ లెగసీ డే





**చర్ల, అక్టోబర్ 08:(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తేగడ శ్రీ సరస్వతి విద్యా నికేతన్ పాఠశాల వ్యవస్థాపకులు శ్రీనివాస చక్రవర్తి వర్ధంతి సందర్భంగా గురువారం పాఠశాలలో ఎస్ఎస్వీఎన్‌లో ఫౌండర్స్ లెగసీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్య, విలువలు, ధర్మబద్ధమైన జీవన విధానంపై కలలుగన్న ఆశయాలను స్మరించుకున్నారు. వ్యవస్థాపకుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలను 'కమ్యూనిటీ హీరోస్'గా గౌరవించి, వారికి కూరగాయలు, నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను అందజేశారు. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన శ్రేష్ఠ ,శిష్య విద్యార్థులకు విద్యా సామగ్రితో కూడిన స్టూడెంట్ కిట్లను అందించారు. విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించేందుకు అన్ని విద్యార్థులకు మెడిటేషన్ మ్యాట్లను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించి, 'ఒక బాలుడు–ఒక మొక్క–ఒక బాధ్యత' అనే సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకురాలు లిఖితాచక్రవర్తి మాట్లాడుతూ, తన తండ్రి నాటిన విద్యా విలువలు, సేవా భావం, ధర్మబద్ధమైన ఆలోచనలను ప్రతి సంవత్సరం మరింత ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఆయన జీవితం తమకు ఒక వారసత్వమని, ఆ వారసత్వాన్ని సేవా కార్యక్రమాల ద్వారా కొనసాగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల్లో సేవా భావం, కృతజ్ఞత, పర్యావరణ పరిరక్షణ, మానవతా విలువలను పెంపొందించేలా కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో అరెస్ట్.. మణుగూరులో ఎఫెక్ట్

- మణుగూరులో రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- రాహుల్, ప్రియాంక అక్రమ అరెస్ట్ కు నిరసన
- ఓటు హక్కు కోసం రోడ్డుపైకి..ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- ఎమ్మెల్యే పాయం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- జంతర్ మంతర్ నుంచి అంబేద్కర్ సెంటర్ దాకా ఆందోళనలు






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 8, ప్రజాజ్యోతి** ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు చేపట్టిన నిరసనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాం క గాంధీ వాద్రాలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ గురువారం మణుగూరులో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టింది. అంబేద్క ర్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ధర్నా, రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై సం ఘీభావం తెలిపారు. అనంతరం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు లేవనెత్తిన అనుమానాలకు ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తే ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన ఎంపీలను అరెస్ట్ చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, లారీ యూనియన్, బొగ్గు ముఠా కార్మికులు, గుమాస్తా సంఘం, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు, బియ్యం వితరణ





**చర్ల, అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి):**కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తద్వారా తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని వనవాసీ కళ్యాణ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, ఉప్పరిగూడెం ప్రాథమిక పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు ఆనందకుమారి విద్యార్థులకు సూచించారు.దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వేమాల ప్రసాద్–సునీత దంపతులు చర్లలోని వనవాసీ కొమరం భీం విద్యార్థి నిలయంలోని విద్యార్థులకు 30 జతల నూతన దుస్తులను అందజేశారు. అలాగే ఉప్పరిగూడెం ప్రాథమిక పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు ఆనందకుమారి తన జన్మదినం సందర్భంగా విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యాన్ని వితరణగా అందించారు.విద్యార్థి నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దాడ ఆశాలత, ఆనందకుమారి, విద్యార్థి నిలయం అధ్యక్షుడు తాటి పాపారావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదవాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.తాము కూడా పేద కుటుంబాల నుంచి వచ్చి శ్రద్ధగా చదువుకోవడం ద్వారా ఈ స్థాయికి చేరుకున్నామని వారు తెలిపారు. తమను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని అన్నారు. మారుమూల గ్రామాలకు చెందిన ఆదివాసీ విద్యార్థులకు విద్యతో పాటు జాతీయ భావాలను పెంపొందించేలా విద్యార్థి నిలయం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.కానిస్టేబుల్ వేమాల ప్రసాద్ గత జూలై 14న తన కుమారుడి జన్మదినం సందర్భంగా విద్యార్థి నిలయానికి వితరణ అందించారని, తాజాగా మరోసారి దుస్తులు అందించి విద్యార్థుల పట్ల తనకున్న మమకారాన్ని చాటుకున్నారని కొనియాడారు. విద్యార్థి నిలయం కేవలం దాతల సహకారంతోనే కొనసాగుతోందని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేద విద్యార్థుల చదువులకు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిలయ కమిటీ ఉపాధ్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ సంతోష్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల చెరువుకు మహర్దశ

- పర్యాటకంగా అభివృద్ధికి అడుగులు
- పర్యాటక శోభ.. బోటింగ్‌తో కొత్త కళ..!
- అశ్వాపురం అందాలకు కొత్త హంగులు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే యోచన
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీపీఓ అనూష



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / అశ్వాపురం. అక్టోబర్ 8, ప్రజా జ్యోతి** కాకతీయుల కాలం నాటి చారిత్రక సంపదకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన తుమ్మల చెరువుకు త్వరలో పర్యాటక శోభ రానుందా అనే చర్చ జోరందుకుంది. చరిత్రకు గుర్తింపు, పర్యాటకానికి ప్రోత్సాహం తోడైతే తుమ్మల చెరువు రూపురేఖలే మారిపోనున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రసిద్ధ తుమ్మల చెరువును జిల్లా పంచాయతీ అధికారి అనూష గురువారం సందర్శించారు. చెరువు ప్రస్తుత పరిస్థితి, అందులో కల్పిస్తున్న బోటింగ్ సౌకర్యాలు, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. చెరువు గట్టున బోటింగ్ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. బోటింగ్‌కు వస్తున్న సందర్శకుల సంఖ్య, భద్రతా ప్రమాణాలు, చెరువు చుట్టూ పార్కు, లైటింగ్, కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఆరా తీశారు. కాకతీయులు నిర్మించిన ఈ చెరువుకు వందల ఏళ్ల చరిత్ర ఉందని, ఇలాంటి చారిత్రక కట్టడాలను కాపాడుకుంటూ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని డీపీఓ అనూష ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల సందర్శనతో తుమ్మలచెరువు అభివృద్ధిపై స్థానికుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, బోటింగ్ నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మావోయిస్టుల డంప్ గుర్తింపు

- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

**చర్ల, అక్టోబర్ 8(ప్రజా జ్యోతి):** మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కోపర్షి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భూగర్భంలో దాచిపెట్టిన భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాల నిల్వను గడ్చిరోలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలపై ఆకస్మిక దాడులకు పాల్పడే ఉద్దేశంతో వీటిని అటవీ ప్రాంతంలో దాచిపెట్టినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో గడ్చిరోలి ఎస్పీ ఎం. రమేష్ మార్గదర్శకత్వంలో అక్టోబర్ 6న ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ప్రాణహిత స్పెషల్ ఆపరేషన్స్ టీమ్‌కు చెందిన ఐదు బృందాలు, బీడీడీఎస్‌కు చెందిన రెండు బృందాలు గాలింపు చర్యల్లో పాల్గొన్నాయి.అడవిని చుట్టుముట్టి అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించగా భూమిలో దాచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు బయటపడ్డాయి. సోదాల్లో .303 రైఫిల్, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, రెండు నాటు తుపాకులు, ఒక బీజీఎల్ లాంచర్‌తో పాటు మొత్తం ఆరు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 10 బీజీఎల్ సెల్స్, 21 సజీవ తూటాలు, ఏడు డిటోనేటర్లు, 150 మీటర్ల కేబుల్ వైర్, రెండు మ్యాగజైన్లు, రెండు కుక్కర్లు, మూడు వాకీటాకీలు, మూడు ఛార్జర్లు, రెండు వాకీటాకీ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.దుర్భేద్యమైన అటవీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని మావోయిస్టులు ఆయుధాలు, పేలుడు పదార్థాలను వివిధ ప్రాంతాల్లో భూగర్భంలో దాచిపెడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నక్సల్ వారోత్సవాలు, ఎన్నికలు, భద్రతా దళాల కదలికల సమయంలో ఆకస్మిక దాడులకు పాల్పడేందుకు వీటిని వినియోగించే అవకాశం ఉందని తెలిపారు.ఈ సోదాల సమయంలో లభించిన మావోయిస్టు సాహిత్యాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌లో స్పెషల్ ఆపరేషన్స్ టీమ్, ప్రాణహిత, ఇంటెలిజెన్స్ సెల్, బీడీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందిని ఎస్పీ ఎం. రమేష్ అభినందించారు.



## చిన్నారుల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యం

- జి.సి.డి.ఓ అలివేలు మంగతాయారు



**ఆళ్ళపల్లి. అక్టోబర్8(ప్రజాజ్యోతి)** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని జి.సి.డి.ఓ అలివేలు మంగతాయారు అన్నారు. గురువారం ఆళ్ళపల్లి మండల పరిధిలో మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు సమతుల్యమైన పోషకాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్తలు వై.వినోద్, ఈ.కిరణ్, కె.క్రాంతి మాట్లాడుతూ 7 నుంచి 10 ఏళ్ల చిన్నారుల ఆహారంలో చిరుధాన్యాలను చేర్చడం వల్ల శారీరక ఎదుగుదల, ఆరోగ్యం మెరుగుపడతాయని తెలిపారు. రాగులు, జొన్నలు, సజ్జలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో జి.పి.ఎస్. మైలారం ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు, ఉపాధ్యాయులు జి.కుమార్ రాజా, అనంతోగు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చీమల భద్రమ్మ, ఎస్సీఆర్పీ నెహ్రూ, ఉపాధ్యాయులు కృష్ణ, ఆయా జోగ సావిత్రి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓటు పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరసన ర్యాలీ



**చర్ల, అక్టోబర్ 8(ప్రజా జ్యోతి):** ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఓటు చోరీ–ఓటు పరిరక్షణ" నిరసన ర్యాలీలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు పాల్గొన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ నాయకత్వంతో పాటు భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన అసలైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అప్రజాస్వామిక పద్ధతుల్లో అధికారాన్ని కైవసం చేసుకునే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి అర్హుడి ఓటును కాపాడాలని, ఓటు చోరీని అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.

## మహిళా సాధికారతకు బతుకమ్మ వేడుకలు ప్రతీక

- ఐలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల వద్ద బతుకమ్మ వేడుకలు



**పినపాక,అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి)**

పినపాక మండలం ఐలాపురం గిరిజన మహిళ ఆశ్రమ పాఠశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సందడి చేశారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మహిళల ఆత్మగౌరవానికి ప్రత్యేక గుర్తింపుగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు . మహిళలు అన్ని రంగాల్లో ముందు కు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఎత్తి స్టెప్స్ వేసిన ఎమ్మెల్యే

- మణుగూరు డిగ్రీ కాలేజీలో బతుకమ్మ సందడి
- విద్యార్థినులతో కలిసి డాన్స్
- తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- మహిళా సాధికారత వేడుకల్లో బతుకమ్మ కోలాహలం
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 8, ప్రజాజ్యోతి**

బతుకమ్మ కేవలం పూల పం డుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతి, సంప్రదాయా లకు ప్రతీక అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువా రం మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళా సాధికారత కేం ద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణాన్ని నింపాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. విద్యార్థినులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఎమ్మెల్యే కలిసి ఆడిపాడారు. బతుకమ్మ పాటలు పాడుతూ విద్యార్థినుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థి దశ నుండే మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మహిళా సాధికారత ఆధ్వర్యంలో కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## రైతు వేదికలో ఘనంగా పోషణ మాసం ముగింపు కార్యక్రమం

- తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**అశ్వారావుపేట, అక్టోబర్ 8: ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట శాసనసభ్యులు గౌరవ శ్రీ జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే సమతుల్యమైన, పౌష్టిక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు.పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆరోగ్యవంతమైన తల్లి–ఆరోగ్యవంతమైన శిశువు–ఆరోగ్యవంతమైన సమాజం లక్ష్యంగా పోషణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితర ఆహార పదార్థాల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల బరువు, ఎదుగుదలను పర్యవేక్షించడం, గర్భిణీలు–బాలింతలకు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విబిజి రామ్ జి పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీలో పనులు ప్రారంభించాలి

- డి ఆర్ డి ఓ విద్యా చందన



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 8 ,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లాలో వికసిత్ భారత్ – గ్రామీణ ఉపాధి జీవనోపాధి మిషన్ పథకం కింద ప్రతి గ్రామ పంచాయతీ, ప్రతి ఆవాస ప్రాంతంలో పనులు ప్రారంభించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యా చందన అధికారులను ఆదేశించారు, ఈ సందర్భంగా డి ఆర్ డి ఓ మాట్లాడుతూ. గ్రామాల్లో పని కోరే ప్రతి ఒక్కరికీ జూన్ 2027 వరకు సరిపడా పనులను ముందుగానే గుర్తించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు.ప్రతి 40 మంది పని కోరే వారికి ఒక మేట్‌ను నియమించి, ప్రతి గ్రామంలో 40 నుంచి 60 మంది వరకు కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద సంవత్సరానికి 125 రోజుల వరకు ఉపాధి కల్పించే అవకాశం ఉందని, కొలతల ఆధారంగా పని చేసిన వారికి రోజుకు రూ.308 కూలి చెల్లింపు జరుగుతుందని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూసార పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పొలం బాటలు, కందకాలు, కాలువల మరమ్మతులు, చెరువుల్లో పూడికతీత పనులను కూడా చేపట్టాలని పేర్కొన్నారు.వ్యక్తిగత లబ్ధిదారులకు నాడెప్ కంపోస్ట్ పిట్లు, పశువులు, మేకలు, గొర్రెల షెడ్లు, కోళ్ల షెడ్లు తదితర నిర్మాణ పనులను చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల కోసం నిర్మించే విఓ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరైనందున వాటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తక్కువగా ఉన్నందున పని కోరే ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ వి బి జి రామ్ జి పథకం పనులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- డీఆర్వో పద్మావతి





**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 8, (ప్రజా జ్యోతి)** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి సూచించారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారం, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు మొత్తం 370 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని, వీటిలో 164 ప్రమాదాలు ప్రాణాంతకమైనవిగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రమాదాల్లో 176 మంది మృతి చెందగా, 23 మంది తీవ్రంగా, 344 మంది స్వల్పంగా గాయపడినట్లు వివరించారు. నమోదైన 370 ప్రమాదాల్లో 369 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 99.4 శాతం కేసుల్లో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రహదారుల వారీగా ప్రమాదాల వివరాలను పరిశీలిస్తూ రాష్ట్ర రహదారులపై 79, ప్రధాన జిల్లా రహదారులపై 4, ఇతర జిల్లా రహదారులపై 32, జాతీయ రహదారులపై 67 ప్రమాదాలు జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటికి గల కారణాలను విశ్లేషించి, సంబంధిత రహదారి సంస్థల ద్వారా అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రమాదాలకు కారణమవుతున్న మలుపులు, బ్లాక్ స్పాట్లు, రహదారి లోపాలను గుర్తించి సకాలంలో సరిచేయాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్ లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 7 కేసులను సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని వినియోగించి త్వరితగతిన ఛేదించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ప్రాణాంతక ప్రమాదానికి సంబంధించి కారణాలను విశ్లేషించి, సంబంధిత రహదారి సంస్థలు రవాణా శాఖకు అవసరమైన సమాచారం అందించి పునరావృత ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్, రవాణా, ఆర్అండ్ బీ, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా రవాణా అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి. బాలాజీ, డీహెచ్ఎంఓ తుకారాం రాతోడ్ , ఆర్అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ ఐ, సీ సెక్షన్ సిబ్బంది సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ- జగన్నాథపురం సబ్‌స్టేషన్లలో విద్యుత్ సామర్థ్యం పెంపు



**కొత్తగూడెం కలెక్టరేట్ ,పాల్వంచ / అక్టోబర్ 8, (ప్రజా జ్యోతి)** పాల్వంచ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు పాల్వంచ సీతారాంపట్నం, జగన్నాధపురం సబ్ స్టేషన్లలో 3.15 ఎం వి ఏ సామర్థ్యం కలిగిన నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సామర్థ్యం పెరగడంతో పాటు, వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని భద్రాద్రి కొత్తగూడెం సూపరింటెండింగ్ ఇంజనీర్ మహేందర్ విలేకరులకు తెలిపారు ,ఈ కార్యక్రమంలో డీఈ (టెక్నికల్) నందయ్య , ఎం ఆర్ టి డీఈ వెంకటేశ్వర్లు, పాల్వంచ డీఈ భద్రపవార్, ఏఈలు గంగాధర్, రాఘవేంద్ర తరుణ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీ చేతుల మీదుగా కఠిన సేవ పథకం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు



**పినపాక,అక్టోబర్ 8(ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు కఠిన సేవ పథకాన్ని అందుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా సీఐ వెంకటేశ్వర్లు ఈ పథకాన్ని స్వీకరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, పోలీస్ శాఖకు అందించిన సేవలను గుర్తిస్తూ ఈ పథకాన్ని అందజేశారు. కఠిన పరిస్థితుల్లోనూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సీఐ వెంకటేశ్వర్లు కీలకంగా వ్యవహరించారని ఎస్పీ కొనియాడారు. పోలీస్ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సీఐ వెంకటేశ్వర్లును అభినందించారు. ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు పొందడం పట్ల సీఐ వెంకటేశ్వర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సీఐ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు.

## జగన్నాథపురం శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో పవిత్ర వృక్షాల పునఃప్రతిష్ఠాపన

- భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా మహోత్సవం





**పాల్వంచ, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** జగన్నాథపురం శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ ఆవరణలో పవిత్ర వృక్షాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఆలయ ప్రాంగణంలోని పవిత్ర రావి, వేప చెట్లు నేలకు ఒరిగాయి. దీంతో వాటిని తొలగించి, అదే ప్రదేశంలో పవిత్ర వృక్షాలను పునఃప్రతిష్ఠించే కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో నిర్వహించారు. ఆలయ ఈఓ ఏ. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, పునఃప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమ దాత గిరీష్ ముక్తేవి దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్ర శ్రీ ఆరాధన పీఠం శ్రీమాన్ కోటి రామస్వరూప్ రాఘవాచార్యుల భక్త బృందం, భ ద్రాచలం సభ్యులతో పాటు అంగులూరి చిన్నారి, వారణాసి ధనలక్ష్మి ఆధ్వర్యంలోని వాసవి మహిళా సేవాదళ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహోత్సవంలో భాగంగా లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, లలి తా పారాయణం, విష్ణు సహస్రనామం, సౌందర్యలహరి తదితర ఆధ్యాత్మిక కా ర్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక పారాయణాలతో మార్మోగింది. కార్యక్రమంలో పాల్వంచ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్, ఆలయ మాజీ ధర్మకర్త సంకా రాము, ధారా నరసింహారావు, ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పల వెంకటేశ్వర్లు, మహిళా సేవాదళ్ సభ్యులు అంగులూరి కల్పన, అంగులూరి చిన్నారి, వారణాసి ధనలక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొని పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం లో సేవలందించారు. పవిత్ర వృక్షాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవం భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాల మధ్య ఘనంగా జరగడంతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి.

## టీబీ ముక్త్ భారత్‌లో విద్యార్థులు భాగస్వాములు కావాలి

- క్షయ వ్యాధి నియంత్రణలో యువత కీలక పాత్ర పోషించాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్



**పాల్వంచ, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** భారతదేశాన్ని క్షయ వ్యాధి రహిత దేశంగా మార్చేందుకు విద్యార్థులు అవగాహన కలిగి, క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టీబీ యూనిట్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), పాల్వంచలో గురువారం టీబీ ముక్త భారత్ జోష్‌టీం జిల్లా కమిటీ నియామకంలో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వాలంటీర్లుగా స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. పద్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ భారతదేశం టీబీ రహిత దేశంగా మారాలని ఆకాంక్షించారు. క్షయ వ్యాధిపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సమాజంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకు రావాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నియంత్రణలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి, తమ కుటుంబాలు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా క్షయ వ్యాధి పీపీఎం / ఏసీఎస్ఎం కోఆర్డినేటర్ శ్రీ టి. సోమయ్య క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పద్ధతులు, అందుబాటులో ఉన్న చికిత్స విధానం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకాష్‌నడ్డా ప్రారంభించిన టీబీ ముక్త్ భారత్ ప్రత్యక్ష కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో వాలంటీర్లుగా నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వేముల కామేశ్వరరావు, కళాశాల ఎన్‌సీసీ అధికారి శ్రీ జి. ధర్మారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ డి. రమేష్, కళాశాల సూపరింటెం డెంట్ శ్రీ టి. విజయ ప్రసాద్, అధ్యాపకులు శ్రీదేవి, డీపీసీ శిరీష, పీహెచ్‌సీ సిబ్బంది, ఎన్‌టీఈపీ కీ స్టాఫ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మాజీమంత్రి హరీష్ రావును కలిసిన రావులపల్లి పృథ్వి

- భద్రాచలం-వాజేడు రహదారి సమస్యపై హరీశ్ రావుకు వినతి



**భద్రాచలం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** తెలంగాణ ఉద్యమ నాయకుడు, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావును నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ తనయుడు, యువజన నాయకుడు రావులపల్లి పృథ్వి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం ప్రాంత పరిస్థితులు, ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో సవివరంగా చర్చించారు. ప్రధానంగా భద్రాచలం పట్టణం నుంచి వాజేడు వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఈ రహదారి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పృథ్వి విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల రాకపోకలకు, అత్యవసర సేవలకు, వ్యాపార కార్యకలాపాలకు ఈ రహదారి ఎంతో కీలకమని, దీని అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీనిపై హరీశ్‌రావు సానుకూలంగా స్పందించినట్లు పృథ్వి తెలిపారు.

## కోయగూడెంలో విషాదం.. ఉరేసుకుని యువకుడి మృతి



**బూర్గంపహాడ్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండలం కోయగూడెం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎస్కే. సద్దాం పాషా (36) గురువారం ఉరేసుకుని మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆయన శ్రీ అరుణ్ ఎంటర్ప్రైజెస్‌లో ఐటీసీ క్యాజువల్ కార్మికుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది.సద్దాం పాషా ఉరేసుకుని మృతి చెందిన విషయాన్ని ఆయన సోదరుడు జకీర్ పాషా పోలీసులకు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం. కాగా సద్దాం పాషా ఆత్మహత్యకు గల కారణాలు ఇప్పటివరకు తెలియరాలేదు. వ్యక్తిగత కారణాలా, ఇతరత్రా కారణాలా అనే కోణంలో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- **రెడ్‌క్రాస్ నూతన కమిటీకి ఇరప రాజు విజ్ఞప్తి**



**భద్రాచలం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి జిల్లాలోని ఆదివాసీ ప్రజలు అధికంగా నివసించే మారుమూల గ్రామాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరపా రాజు కోరారు. భద్రాచలం, పినపాక, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధిలోని అనేక ఆదివాసీ గ్రామాలకు వైద్య సేవలు అందుబాటులో లేవన్నారు. ఆర్థిక ఇబ్బందులు, రవాణా సౌకర్యాల కొరతతో ప్రజలు సకాలంలో వైద్యం పొందలేకపోతున్నారని తెలిపారు. ఉచిత సాధారణ వైద్య పరీక్షలతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని కోరారు. రక్తహీనత, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై పరీక్షలు, అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత మందులు అందించాలని సూచించారు. అత్యవసర రోగులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేందుకు సహకరించాలని కోరారు. మారుమూల గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఇరపా రాజు విజ్ఞప్తి చేశారు.

## నూతన సీఐ సట్ల రాజును కలిసిన బీజేపీ నాయకులు

**భద్రాచలం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** భద్రాచలం పట్టణ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సట్ల రాజును బీజేపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సీఐతో చర్చించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మా, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నిడదవోలు నాగబాబు, మాజీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బోడ సత్యనారాయణ, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- **రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ అంకిత్**







**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 8, (ప్రజాజ్యోతి)**
కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం వైద్యఆరోగ్య శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూఆసుపత్రుల్లో నిర్ణయించిన ఓపీ సమయాలను కచ్చితంగా పాటించాలని, రోగులు వైద్యం కోసం వచ్చిన సమయంలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాత్రి సమయాల్లో కూడా అత్యవసర వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా డ్యూటీ వైద్యుల విధులను పర్యవేక్షించాలని తెలిపారు. విధి నిర్వహణలో అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని ఆదేశించారు.పాల్వంచ, రామవరం, అశ్వారావుపేట, భద్రాచలం, బూర్గంపహాడ్ తదితర ప్రాంతాల్లో వైద్య సేవల పరిస్థితిని సమీక్షిస్తూ గైనకాలజీ వైద్యుల అందుబాటు, ప్రసూతి సేవలు, కేసుల భారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని బలోపేతం చేయాలని సూచించారు. అవసరమైన సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని, డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ తదితర అందుబాటులో ఉన్న నిధులతో అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాల పనులు, అదనపు పడకల సామర్థ్యం, అవసరమైన వైద్య పరికరాలపై కలెక్టర్ సమీక్షించారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సూపర్‌వైజర్లు తదితర సిబ్బందితో ఆసుపత్రుల సూపరింటెండెంట్లు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి విధి నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రి నిర్వహణపై సమీక్షించాలని కలెక్టర్ సూచించారు.డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన పరీక్షలు, మందులు, వైద్య సిబ్బంది అందుబాటును ముందుగానే నిర్ధారించుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో డి సి హెచ్ ఎస్ రవిబాబు, జిల్లా ఏరియా ఆసుపత్రిల సూపర్డెంట్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల కళాశాలలో కంటి పరీక్షల శిబిరం

- **ఐటీడీఏ పీఓకు రెడ్‌క్రాస్ కార్యవర్గం ఆహ్వానం**



**భద్రాచలం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కళాశాల బాలికలకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు కంటి సమస్యలు ఉన్న వారికి అవసరమైన కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ శిబిరానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు కలిసి ఆహ్వానించారు. గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి అరుణ కుమారికి కూడా ఆహ్వానం అందజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుల్ల నాగేశ్వరరావు, కోశాధికారి తోటమల్ల బాలయోగి పాల్గొన్నారు.

## భద్రాచలం బజరంగ్దళ్ సంయోజక్ గా మోరంపల్లి రాము



**భద్రాచలం , అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)** భద్రాచలం పట్టణ బజరంగ్దళ్ సంయోజక్ గా మోరంపల్లి రాము నీ నియమించినట్లు జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత నియమించారు.ప్రస్తుతం విశ్వ హిందూ పరిషత్ భద్రాచలం పట్టణ విశేష సంపర్క్ ప్రముఖ్ గా ఉన్న మోరంపల్లి రాము ని ఈ రోజు భద్రాచలం శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల వద్ద జరిగిన భద్రాచలం ప్రఖండ సమావేశంలో ప్రఖండ అధ్యక్ష, కార్యదర్శులు, బజరంగ్దళ్ జిల్లా టోలీ సభ్యులు మణి శేషు కర్ణ సూచనల మేరకు బజరంగ్దళ్ భద్రాచలం పట్టణ సంయోజక్ గా ప్రకటించడం జరిగింది, ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు అందరూ మోరంపల్లి రాము కి శుభాకాంక్షలు తెలియజేస్తూ బజరంగ్దళ్ సంయోజక్ గా భద్రాచలం పట్టణం లో బజరంగ్దళ్ కార్యకర్తల సంఖ్య పెంచి, హిందూ ధర్మ రక్షణ, గోరక్షణ, హిందూ కన్యా రక్షణ, సేవా కార్యక్రమాలు చురుకుగా చెయ్యాలని కోరడం జరిగింది, ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ మందిర అర్చక పురోహిత్ తెలంగాణ రాష్ట్ర సహ ప్రముఖ్ వోరుగంటి సురేష్ కుమార్, విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, బజరంగ్దళ్ జిల్లా టోలీ సభ్యులు మణి శేషు కర్ణ, ప్రఖండ అధ్యక్షులు తాటిపాముల తిరుపతి రావు, ప్రఖండ కార్యదర్శి కొమ్రాజు నాగేశ్వరరావు, తదితర కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## చేయూత పెన్షన్లపై రాండమ్ వెరిఫికేషన్

- **లబ్ధిదారుల వివరాలు పరిశీలించిన జిల్లా పరిషత్ సీఈఓ బి. నాగలక్ష్మి**

**పాల్వంచ, అక్టోబర్ 8, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో చేయూత పెన్షన్ లబ్ధిదారుల వివరాలను జిల్లా పరిషత్ సీఈఓ శ్రీమతి బి. నాగలక్ష్మి గురువారం రాండమ్ వెరిఫికేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా దంతలబోరా, దంతలబోరా ఎస్సీ కాలనీ, బంద్రుగొండ, నాగారం, నారాయణరావుపేట, జగన్నాథపురం, లక్ష్మీదేవిపల్లి, కేశవపురం, సోములగూడెం గ్రామపంచాయతీల్లో పర్యటించిన సీఈఓ.. చేయూత పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు.

### ›› విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

అనంతరం దంతలబోరా ఎస్సీ కాలనీలోని పాఠశాలను జిల్లా పరిషత్ సీఈఓ బి. నాగలక్ష్మి , ఎంపీడీవో పి. రాజారావుతో కలిసి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

### ›› డైలీ లేబర్ల హాజరుపై ఆరా

దంతలబోరా గ్రామపంచాయతీలో వర్క్ లిస్టులో ఉన్న డైలీ లేబర్ల సంఖ్య, ప్రతి రోజూ పనులకు హాజరవుతున్న వారి వివరాలను పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి సీఈఓ తెలుసుకున్నారు. వీలైనంత ఎక్కువ మంది డైలీ లేబర్లు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డైలీ లేబర్ల ద్వారా పనులు నిర్వహించడం వల్ల గ్రామపంచాయతీకి సమకూరే ఆదాయం, రెవెన్యూ జనరేషన్ తదితర అంశాలను కె. ప్రసాద్ సీఈఓకు వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామపంచాయతీకి మరింత ఆదాయం సమకూరే విధంగా వీలైనంత ఎక్కువ పనులకు శాంక్షన్లు పొందాలని సీఈఓ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. రాజారావు, సంబంధిత గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే జారె ఆదినా రాయణ భరోసా
- జర్నలిస్టుల హక్కుల సాధనకు టీజేఎంయూ సమర శంఖం
- అశ్వారావుపేటలో ఘనంగా ముగిసిన టీజేఎంయు మహాసభలు
- అక్రిడేషన్లతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుపనూరి ప్రభాకర్ డిమాండ్



**అశ్వారావుపేట, అక్టోబర్ 8 ప్రజా జ్యోతి** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తున్న పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయూ) సమర శంఖం పూరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో గురువారం నిర్వహించిన టీజేఎంయూ నియోజకవర్గ స్థాయి మహాసభలు అపూర్వ ఉత్సాహం, పాత్రికేయుల భారీ ఐక్యత నడుమ అత్యంత విజయవంతంగా ముగిశాయి.

**›› జర్నలిస్టులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు కీలక వారధిగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, విద్యా రాయితీలు అందేలా ప్రభుత్వం నుంచి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొనే అక్రమ కేసులు, వేధింపుల విషయంలో తాను వెన్నంటే ఉంటానని భరోసా ఇచ్చారు. నిజాన్ని నిర్భయంగా సమాజం ముందుకు తీసుకురావాలని, ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసే విధంగా కలాలకు పదును పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

**›› వాస్తవాలను వెలికితీయడమే జర్నలిజం: జూపల్లి రమేష్ బాబు**

అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ సమాజ హితం కోసం నిస్వార్థంగా పని చేసే జర్నలిస్టులను ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో ఆదుకోవాలని కోరారు. వార్తలు రాసే సమయంలో వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రచురించడం ద్వారా సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని, సమస్య ఉన్నచోట రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

**›› అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ సంక్షేమ పథకాలు దక్కాలి: ఇనుపనూరి ప్రభాకర్**

టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఇనుపనూరి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు జర్నలిస్టులకు ఎన్నో హామీలు ఇచ్చి, గెలిచిన తర్వాత విస్మరించడం పాలకులకు పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులలో చిన్న, పెద్ద అనే వ్యత్యాసాలు సృష్టించి ప్రభుత్వాలు కాలయాపన చేయడం తగదన్నారు. అక్రిడేషన్లతో సంబంధం లేకుండా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, హెల్త్‌కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. చిన్న పత్రికల మనుగడ కోసం ప్రభుత్వ ప్రకటనలను సమానంగా కేటాయించాలని, ప్రతి జిల్లాకు రెండు చొప్పున అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు, వారు ఎదురుకుంటున్న కేసులపట్ల అండగా టీజేఎంయూ యూనియన్ అండగా ఉంటుందని, త్వరలో భద్రాద్రి జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు న్యూస్ పట్ల ట్రైనింగ్ నిర్వహిస్తారని ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. అక్రిడేషన్ ఉన్న వారే జర్నలిస్టు లు కాదని, వర్కింగ్ జర్నలిస్టులు కూడా జర్నలిస్టులనే ఎవరికీ బయపడాల్సిన పనిలేదని, నిరంతరం ప్రజలకోసం, మన యూనియన్ సభ్యులకోసం మనమంతా అండగా ఉండాలని, భద్రాద్రి జిల్లాలో అన్నీ నియోజకవర్గంలో మహాసభలు నిర్వహించి, భద్రాద్రి జిల్లాలో అదిపెద్ద మీటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రతీ ఒక్కరూ సహకరించాలని అన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా ఎన్ యు జె ఐ అనుబంధ సంస్థగా భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కుల కోసం పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, పాత్రికేయులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో టీజేఎంయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సామల ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఏఎం కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాతగట్ల రవి, ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రణీత్ కుమార్, నాయకులు జి. రాజశేఖర్, రవి, శ్రీమన్నారాయణలతో పాటు నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విలేకరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

- సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్
- కార్మికులకు సన్మానం.. కాళ్లు కడిగి గౌరవించిన బీజేపీ నాయకులు



**అశ్వరావుపేట అక్టోబర్ 8 ప్రజాజ్యోతి :** సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం ప్రతిరోజూ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా నిస్వార్థంగా సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని, ఆయన జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు.బీజేపీ 17వ వార్డు కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ, బీజేపీ జిల్లా కార్యదర్శి పమిడి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజలు ఉదయం నిద్రలేవకముందే విధుల్లోకి చేరి చెత్తను తొలగిస్తూ, రోడ్లు, కాలనీలు పరిశుభ్రంగా ఉంచేందుకు వారు అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఎండ, వాన, చలి వంటి ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను సమాజం గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. స్వీట్లు తినిపించి వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా పారిశుధ్య కార్మికుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ కౌన్సిలర్ పమిడి గీతాశ్రీ, బీజేపీ నాయకుడు పమిడి లక్ష్మీనారాయణ వారి కాళ్లు కడిగి, ఆ నీటిని నెత్తిన జల్లుకుని వినూత్నంగా గౌరవించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు భావోద్వేగానికి గురయ్యారు.ప్రధాని నరేంద్ర మోదీ సేవా భావాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని వివిధ వర్గాలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. సమాజ నిర్మాణంలో ప్రత్యక్షంగా భాగస్వాములవుతున్న పారిశుధ్య కార్మికులను గౌరవించడం తమకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెట్ట వెంకటేష్, మండల ప్రభారీ ఉడతనేని విశ్వేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రాయుడు ఆంజనేయులు, మండల కార్యదర్శి మేడవరపు కృష్ణ చైతన్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎస్వీటీ కొండ, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు తానికొండ రాంబాబు, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తంబళ్ల రవి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొట్టిపూళ్ల దుర్గా శ్రీనివాస్, జిల్లా సెల్ కన్వీనర్ సొలస పుష్కర్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రావిక్రింది కుమార్ రాజా, శీమకుర్తి సుబ్బారావు, సోమిశెట్టి లక్ష్మీ నరసింహారావు, ములగచర్ల సాయి కృష్ణ, పమిడి అప్పారావు, పమిడి సహదేవ్, దమ్మపేట మండల అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా భద్రాద్రి జిల్లా కన్వీనర్ నాగుల చందు తదితరులు పాల్గొన్నారు.



# ఐటీడీఏ పీవో తక్షణమే జీవో నెంబర్ 57 ద్వారా ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి

- పోలీసు ఉద్యోగ నియమాకాలలో 75% రిజర్వేషన్ కల్పించాలి
- సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ శ్రీనివాస్ నాయక్

**లక్ష్మీదేవి పల్లి ,8 అక్టోబర్ ,ప్రజా జ్యోతి:** ఏజెన్సీ ఏరియాలో జీవో 3 కు బదులుగా మరొక జీవోను ఏర్పాటు చేసి పోలీస్ ఉద్యోగాలలో గిరిజన ఆదివాసులకు రిజర్వేషన్ కల్పించాలని అదేవిధంగా ఏజెన్సీ పరిధిలో ఉన్నటువంటి ఐటీడీఏ ద్వారా 29 శాఖలకు నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఐటీడీఏ ద్వారా ఎటువంటి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు ఏజెన్సీ ఏరియాలో జీవో నెంబర్ 57 ప్రకారం 29 శాఖలకు నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేసే అధికారం ఉన్నప్పటికీ గిరిజన ఆదివాసులకు భర్తీ చేయకుండా తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తున్నారు ఐటీడీఏ పీవో తక్షణమే జీవో 57 ద్వారా ఏజెన్సీ డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలని సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు ఈ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గణేష్ రాంబాబు చందు మల్చూర్ తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ ఆలయంలో 11 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

- అధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేసిన ఆలయ కమిటీ




**భద్రాచలం, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి ):** భద్రాచలం ఆర్టీసీ ఇన్‌గేట్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా మహోత్సవాలు, శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఈ నెల 11న ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి 20న విజయదశమి వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొంది. ఇందులో భాగంగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డీఎస్పీ అరుణ్ కుమార్, తహసీల్దార్ టీ.రవి, సీఐ సట్ల రాజు, పట్టణ ఎస్ఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి రావులను ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఆలయ కమిటీ చైర్మన్ మాగాపు రాజు, ఈవో ఎస్.శేషయ్య, ప్రధాన అర్చకులు విశ్వనాథ శర్మ, కమిటీ సభ్యులు రాజా, రాజేష్ తదితరులు అధికారులను ఆహ్వానించారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

# సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే కు వినతి



**ములకలపల్లి అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి):** రాచన్నగూడెం గ్రామపంచాయతి పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కు పంచాయతీ సర్పంచ్ మడకం విజయ వినతి పత్రాన్ని అందించారు. . గురువారం గండుగులపల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, జగన్నాథపురం మాజీ ఎంపిటిసి సున్నం సునీత ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో నెల కొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు.ముఖ్యంగా గ్రామాలలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని,అలాగే ఇండ్ల స్థలాల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సర్పంచ్ వినతిపత్రం అందజేసినారు.దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే రాచన్నగూడెం పంచాయతీలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జారే అధినాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



**చర్ల , అక్టోబర్ 8(ప్రజా జ్యోతి ):**నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షులు తోటపల్లి రమణ, ఉపాధ్యక్షులు అందుర్తి వెంకట్రావు కోరారు. సంప్రదాయ కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నాయి బ్రాహ్మణులు ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు, చట్టాలు, జీవోలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అర్హులైన వారికి సబ్సిడీ రుణాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.కులవృత్తిని కొనసాగిస్తున్న వారికి ఆధునిక పరికరాలు అందించడం, వృత్తి అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులైన నాయి బ్రాహ్మణ కుటుంబాలకు పూర్తిస్థాయిలో అందడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి నాయి బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.నాయి బ్రాహ్మణుల సంక్షేమం, సంప్రదాయ కులవృత్తి పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని తోటపల్లి రమణ, అందుర్తి వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు.

## లింగాలలో పశు వైద్య శిబిరం



**చర్ల, అక్టోబర్ 8(ప్రజా జ్యోతి ):**చర్ల మండలం లింగాల గ్రామంలో గురువారం గోపాలమిత్ర ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పశుపోషకులకు పశువుల ఆరోగ్యం, వ్యాధుల నివారణ, సంరక్షణపై పలు సూచనలు అందించారు.ఈ శిబిరంలో చర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ సుధారాణి, దుమ్ముగూడెం పశువైద్యాధికారి డాక్టర్ ఎన్. లిఖిత పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి పశువుల్లో వ్యాధుల లక్షణాలను గుర్తించడం, సకాలంలో వైద్యం అందించడం, పశువుల పోషణపై రైతులకు అవగాహన కల్పించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పశు వైద్య శిబిరాలను నిర్వహించడం వల్ల పశుపోషకులకు పశువుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెరగడంతో పాటు, వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించేందుకు అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ కే. సురేష్, వీఏ జి. హరికాంత్, ఓయ్సస్ శ్రీనివాస్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జక్కరయ్య, గోపాలమిత్రులు మాటూరు చంద్రశేఖర్, గుమ్మల రామకృష్ణ, బెండపోయిన పవన్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారులపై 'లేబర' వల

- పాల్వంచలో హోటళ్ల చుట్టూ ముసురుతున్న వివాదాలు!
- కార్మికుడి పంచాయితీతో మొదలై.. లక్షల డిమాండ్ దాకా వెళ్లిన వ్యవహారం
- రాజకీయ ఒత్తిళ్లు, సోషల్ మీడియా బెదిరింపులపై హోటల్ యజమానుల ఆవేదన
- ముడిసరుకుల ధరలతో సతమతమవుతున్న చిరు వ్యాపారులకు కొత్త చిక్కులు..
- పోలీసులను ఆశ్రయించిన ఇరువర్గాలు!




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / పాల్వంచ, అక్టోబరు 6 (ప్రజాజ్యోతి):** పట్టణంలో నిత్యం వందలాది మందికి ఆకలి తీర్చే చిరు హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్లు ఇప్పుడు వివాదాలకు నిలయంగా మారుతున్నాయి. సాధారణ కార్మిక సమస్యలను ఆసరాగా చేసుకుని వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే యత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు పాల్వంచ వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. కార్మికుల హక్కుల పేరుతో కొందరు వ్యక్తులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటూ తమ వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని హోటల్ యజమానులు వాపోతుండగా.. మరో వైపు తమకు అన్యాయం జరిగిందని కార్మికుల వర్గం పేర్కొంటోంది.

### » మద్యం మైకంతో మొదలైన పంచాయితీ!

వివాదానికి సంబంధించి లభించిన సమాచారం ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని బీసీఎం రోడ్డు సమీపంలో ఉన్న ఒక ప్రముఖ రెస్టారెంట్‌లో పని చేసే కార్మికుడు వరుసగా విధులకు మద్యం సేవించి వస్తుండటంతో యాజమాన్యం మందలించింది. వినియోగదారులకు భద్రత, నాణ్యత ముఖ్యం కాబట్టి పద్ధతి మార్చుకోవాలని లేదా పనికి రావద్దని హెచ్చరించారు. ఈ చిన్న కార్మిక వివాదాన్ని ఆసరాగా చేసుకున్న సదరు ఉద్యోగి, బయట వ్యక్తుల సహాయాన్ని కోరినట్లు సమాచారం.

### » రూ.10 లక్షల డిమాండ్.. సీన్ లోకి బయటి వ్యక్తులు!

కార్మికుడి వ్యవహారాన్ని పెద్దది చేసి హోటల్ వద్ద హంగామా సృష్టించడమే కాకుండా, సదరు యాజమాన్యంపై మొదట రూ.10 లక్షలు, ఆ తర్వాత రూ.5 లక్షలు ఇస్తేనే వ్యవహారం సర్దుమణిగుతుందని డిమాండ్ చేసినట్లు హోటల్ వర్గాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. అంతటితో ఆగకుండా రెస్టారెంట్ ప్రతిష్ఠ దెబ్బతినేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, సందేశాలు ప్రచారం చేస్తున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బెదిరింపుల లొసుగులపై హోటల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇటు అవతలి వర్గం కూడా పోలీసులను ఆశ్రయించడంతో ఈ అంశం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

### » ధరల భారం నడుమ కొత్త ముప్పు!

ప్రస్తుతం నిత్యావసరాలు, పాలు, నూనెలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీల పెరుగుదలతో హోటల్ రంగాన్ని నడపడం కత్తి మీద సాములా మారింది. తక్కువ లాభాలతో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ వ్యాపారం చేస్తుంటే.. ఇలాంటి అవాంఛనీయ వివాదాలు తమను మరింత కుంగదీస్తున్నాయని యజమానులు పేర్కొంటున్నారు. ఈ రకమైన వివాదాలు పట్టణంలో వ్యాపార వాతావరణాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని యజమానులను భయపెట్టే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా కార్మిక శాఖ అధికారులు సమగ్ర విచారణ జరపాలని పాల్వంచ హోటల్ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

**రాజకీయ రంగు.. బ్లాక్‌మెయిలింగ్ ఆరోపణలు!**

వ్యాపార సంస్థల్లో యాజమాన్యానికి, కార్మికులకు మధ్య ఘర్షణలు వస్తే లేబర్ చట్టాల ప్రకారం పరిష్కరించుకోవడానికి ప్రత్యేక మార్గాలున్నాయి. కానీ, పాల్వంచలో కొందరు రాజకీయ నేతలు, ఇతర వ్యక్తులు ఈ కార్మిక సమస్యలను ఆసరాగా చేసుకుని స్వప్రయోజనాల కోసం 'సెటిల్మెంట్లు' చేసేందుకు ప్రయత్నిస్తున్నారని హోటల్ యజమానులు విమర్శిస్తున్నారు. రాజకీయ అండ చూపిస్తూ నిబంధనల పేరుతో వ్యాపారులను మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నారని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణల్లో నిజానిజాలు ఎంతవరకున్నాయనేది పోలీసుల విచారణలోనే స్పష్టం కావాల్సి ఉంది.

## బలికావలసిందేనా పసిపాపల భవిష్యత్తు?

- అంగన్వాడి పోస్ట్ రగడ..!
- పాఠశాలకు విద్యార్థుల అడ్డుకోలు..
- పౌష్టికాహారానికి దూరమైన పసిపిల్లలు, గర్భిణులు
- సీడీపీవో అలసత్వంపై అల్లిగుంపు గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం

**ములకలపల్లి, అక్టోబర్ 08, ప్రజాజ్యోతి :** ఒక చిన్న అంగన్‌వాడీ ఆయా పోస్టు భర్తీ వ్యవహారం రెండు గ్రామాల మధ్య చిచ్చురేపింది. అధికారుల నిర్లక్ష్యం, కాలయాపన ఫలితంగా నాలుగు రోజులుగా పసిపిల్లలకు పౌష్టికాహారం కరువైంది. పాఠశాల పిల్లలను అడ్డుకునేంతగా వివాదం తీవ్రరూపం దాల్చినా, సంబంధిత అధికారులు తొలిరోజుల్లో స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**స్థానికులకే ఇవ్వాలని పట్టు....** పాతగంగారం పంచాయతీ పరిధిలోని అల్లిగుంపు (కాపుగంగారం) హాబిటేషన్ అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టు భర్తీకి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. వచ్చిన ఐదు దరఖాస్తుల్లో రెండింటిని అనర్హమైనవిగా తోసిపుచ్చిన అధికారులు, ముగ్గురికి కాల్ లెటర్లు పంపించారు. అయితే ఆ ముగ్గురిలో ఇద్దరు కొత్తగంగారానికి చెందిన వారు కాగా, ఒక్కరు మాత్రమే అల్లిగుంపు వాసి. తమ గ్రామంలోని కేంద్రానికి స్థానిక మహిళకే అవకాశం ఇవ్వాలని అల్లిగుంపు వాసులు పట్టుబడుతున్నారు.

**కేంద్రానికి తాళాలు.. రచ్చకెక్కిన పంచాయతీ....**తమ డిమాండ్‌ను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు వేశారు. విషయం పోలీస్ స్టేషన్‌కు చేరడంతో పోలీసులు, అధికారులు వచ్చి తాళాలు తీయించినప్పటికీ పరిస్థితి సర్దుమణగలేదు. ఫలితంగా గత మూడు-నాలుగు రోజులుగా చిన్నారులకు పౌష్టికాహారం, గర్భిణులు మరియు బాలింతలకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి.

**పాఠశాల పిల్లలకూ తాకిన వివాదం....**పెద్దల మధ్య మొదలైన ఈ రగడ చివరకు పసిపిల్లల చదువులకూ విస్తరించింది. అల్లిగుంపు నుంచి కొత్తగంగారం ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులను కొత్తగంగారానికి చెందిన కొందరు అడ్డుకుని ఇళ్లకు పంపించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పరిస్థితి చేయిదాటిన తర్వాత గురువారం సీడీపీవో గ్రామానికి వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిబంధనలను తొలిరోజే స్పష్టంగా వివరించి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదని స్థానికులు మండిపడుతున్నారు.

**వెనుక ఉండి నడిపిస్తున్నది ఎవరు? ...**ఈ మొత్తం వ్యవహారం వెనుక అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సరఫరా చేసే ఓ సబ్ కాంట్రాక్టర్ హస్తం ఉందనే ఆరోపణలు అల్లిగుంపు వాసుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఆయా నియామకంలో ఆయన జోక్యం చేసుకుంటున్నారని గ్రామస్తులు అనుమానిస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు.

**తక్షణ చర్యలు చేపట్టాలి...**అధికారుల నిర్లక్ష్యం, పెద్దల పంచాయతీల మధ్య పసిపిల్లల చదువు, పౌష్టికాహారం బలికావడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని వివాదాన్ని పరిష్కరించాలని, చిన్నారులకు పౌష్టికాహారం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై దమ్మపేట సిడిపిఓ హేమ సత్యను వివరణ కోరగా అంగన్వాడీ కేంద్రానికి తాళం వేసిన వెంటనే సంబంధిత సుపర్వైజర్లను సంఘటన స్థలాన్ని పంపించడం జరిగినది అని తెలిపారు. తాను ఇతర విధులలో బిజీగా ఉండటం వలన రాలేకపోయానని తెలిపారు. గురువారం వెళ్లి గ్రామస్తులతో మాట్లాడేది చెప్పడం జరిగిందన్నారు. కాపు గంగారం ఆయా పోస్టుకు ఐదుమంది



దరఖాస్తు చేసుకోగా ముగ్గురు అర్హత లిస్టులో ఉన్నారని తెలిపారు. అభ్యంతరాలు తెలపాలి అని వారికి సంబంధించిన విరవరాలతో పంచాయతీ కార్యాలయంలో నోటీసు బోర్డులో పెట్టడం జరిగింది. ఏమి అభ్యంతరాలు రాకపోవడంతో ముగ్గిరు దరఖాస్తు దారులను ఇంటర్వ్యూ నిర్వహిమాచాము. ఎంపిక మాత్రం కలెక్టర్ అధ్యక్షతన ఉండే సెలక్షన్ కమిటీ బాధ్యత అని తెలిపారు. వివాదం విషయంలో విచారణ చేసి గ్రామస్తుల డిమాండ్ ను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. విద్యార్థులను స్కూల్ కి అడ్డుకున్న విషయంపై కొత్త గంగారం ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం ఆనంద రావు వివరణ కోరగా తల్లిదండ్రుల ద్వారా విషయం తెలుసుకొని బయట వచ్చి చూస్తే ఎవరు లేరు అని ఆ విద్యార్థుల కు మరల శుక్రవారం పరీక్ష పెడతామని తెలిపారు.






# కార్పొరేషన్‌లో.. 'టౌన్ ప్లానింగ్' విఫలం!

- అడ్డగోలు నిర్మాణాలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు..
- ఎంజీ రోడ్డుపై పార్కింగ్ కష్టాలు.. ఫుట్‌పాత్‌లు మొత్తం ఆక్రమణలలే..
- నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోని టౌన్ ప్లానింగ్..
- ఫిర్యాదులు చేసినా స్పందన లేదంటున్న బాధితులు..
- అధికారుల తీరుపై ఆరోపణలు.. డబ్బులు చేతులు మారుతున్నాయన్న ప్రచారం..?
- రెండు నెలల తర్వాత కదిలిన యంత్రాంగం.. హెచ్చరికలతోనే సరిపెడతారా?

**కొత్తగూడెం పట్టణం అభివృద్ధి వైపు వేగంగా పరుగులు తీస్తోందన్న ప్రచారానికి, క్షేత్ర స్థాయి వాస్తవాలకు నడుమ ఆకాశమంత వ్యత్యాసం కనిపిస్తోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌గా అవతరించినప్పటికీ, యంత్రాంగం వైఫల్యం వల్ల అడ్డగోలు నిర్మాణాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ అభివృద్ధిని నిబంధనల ప్రకారం నడిపించాల్సిన పట్టణ ప్రణాళికా విభాగం (టౌన్ ప్లానింగ్) కంటిముందే ఉల్లంఘనలు జరుగుతున్నా టీపీఓ పర్యవేక్షణ కొరవడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల మౌనం వెనుక భారీ కుంభకోణం ఉందన్న ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.**

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

### నరకప్రాయంగా మారిన 'ఎంజీ రోడ్డు'

కొత్తగూడెం – భద్రాచలం – విజయవాడ మార్గాన్ని అనుసంధానించే జాతీయ రహదారి–30 పరిధిలోని 'ఎంజీ రోడ్డు' (రైల్వే స్టేషన్ నుండి ఓల్డ్ డిపో వరకు) పట్టణానికి గుండెకాయలాంటిది. రహదారి రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతున్న ఈ రోడ్డుపై వెలుస్తున్న వ్యాపార సముదాయాల్లో పార్కింగ్ సదుపాయాలు మాత్రం మరింత మాయమవుతున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన టీపీఓ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడంతో, కొనుగోలుదారులు తమ వాహనాలను ప్రధాన రహదారిపైనే నిలపాల్సి వస్తోంది, లేదంటే రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చార్జీలు చెల్లించుకోవాల్సి వస్తోంది. మరోవైపు పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడంతో, ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని రద్దీగా ఉండే రహదారిపైనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది.

### అధికారుల అండతోనే అక్రమ నిర్మాణాలు?

ఈ క్రమంలోనే ఎంజీ రోడ్డులో సెట్‌బ్యాక్‌లు వదలకుండా, పక్కనే ఉన్న వ్యాపార సంస్థల రాకపోకలకు భంగం కలిగిస్తూ సాగుతున్న ఓ నిర్మాణం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అనుమతులు లేకుండా, ప్రజా వినియోగంలో ఉన్న స్థలాన్ని ఆక్రమిస్తున్నా టీపీఓ స్థాయి అధికారి స్థల పరిశీలన చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణాలపై బాధితులు ఫిర్యాదులు చేసినా సంభందిత సిబ్బంది స్పందించకపోగా, ఫిర్యాదుదారుల సమాచారాన్ని బయటకు లీక్ చేస్తూ వారిపై ఒత్తిడి తీసుకొచ్చే వాతావరణాన్ని సృష్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో సాగుతున్న ఈ నిర్లక్ష్యం వెనుక లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయనే ప్రచారం కూడా జోరందుకుంది.

### వెంటనే చర్యలు తీసుకోవాలి!

ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నిత్యం సంచరించే ప్రాంతంలోనే ఈ అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. నిర్మాణాలు పూర్తయ్యాక నోటీసులు ఇవ్వడం కాకుండా, ప్రారంభ దశలోనే అక్రమా నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగంపై ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఎంజీ రోడ్డు వివాదాస్పద నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, టీపీఓ తీరుపై చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### సెట్‌బ్యాక్ నిబంధన స్థిరంగా ఉండదు ; జి. నవీన్ కుమార్ (టీపీఓ)

"సెట్‌బ్యాక్ అనేది ప్రత్యేకంగా ఏ ఒక్క నిబంధన ప్రకారం స్థిరంగా ఉండదు. అక్కడి స్థల పరిస్థితి, దాని విస్తీర్ణాన్ని బట్టి మాత్రమే సెట్‌బ్యాక్ నిర్ణయిస్తారు. అది హైవే రోడ్డైనా, కార్పోరేషన్ అయినా లేదా ఇతర ఎక్కడైనా సరే ఇదే విధానం వర్తిస్తుంది. ఆక్రమ నిర్మాణాలపై ఇప్పటికే మేము పరిశీలన జరుపుతున్నాం. మా పైఅధికారుల నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని, ఆలాంటి నిర్మాణంపై చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవి తీసుకుంటాం. అయితే, అది ఇప్పటికే నిర్మించేసిన పాత భవనమైతే మాత్రం మేము ఏమీ చేయలేము. కానీ, ప్రస్తుతం కొత్తగా నిర్మాణం జరుగుతుంటే మాత్రం దానిపై మా అధికారులతో చర్చిస్తాం.."

### రెండు నెలల నుంచి ఆక్రమణ..

ఎంజీ రోడ్డులోని ఫుట్‌పాత్‌ను ఆక్రమించి, సెట్‌బ్యాక్ లేకుండా ఏకంగా రెండు నెలల నుంచి నిర్మాణం చేపడుతున్నా టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం పట్టించుకోపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం ఓ బాధితుడు కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లడంతో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించారు. అనుమతులు లేవని, ఫుట్‌పాత్‌ను ఆక్రమించారని గుర్తించి, ఆ కట్టడాన్ని వెంటనే కూల్చివేయాలని భవన యజమానికి హెచ్చరికలు జారీ చేశారు. అయితే రెండు నెలలుగా నిద్రమత్తులో ఉన్న అధికారులు, ఫిర్యాదు వచ్చాక కేవలం హెచ్చరికలతో సరిపెడతారా లేక నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అక్రమ నిర్మాణాన్ని నేలమట్టం చేస్తారా అనేది వేచి చూడాలి.